www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 10-6-2024

Ananthapuramu | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

అనంతపురము సిటీ**

ఇండోర్ స్టేడియానికి ఎన్టీఆర్ పేరు



ఇండేర్ స్టేడియం పేరు మార్చిన టీడీపీ నాయకులు

పెనుకొండ రూరల్, జూన్ 9: పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని కొండాపురానికి వెళ్లే రహదారిలో ఇండోర్ స్టేడియానికి టీడీపీ నాయకులు ఎన్టీఆర్ పేరు పెట్టారు. పరిటాల డిగ్రీ కళాశాల మైదానంలో తెలుగుదేశం హయాంలో ఎన్టీఆర్ ఇండోర్ స్టేడియం పేరుతో క్రీడా వికాసకేంద్రం నిర్మించారు. 2019లో వైసీపీ అధికారంలోకి రాగానే వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియంగా పేరు మార్చారు. ప్రస్తుతం టీడీపీ అధికారంలోకి రావడంతో ఆదివారం టీడీపీ స్థానిక నాయకులు ఇండోర్ స్టేడియానికి ఉన్న వైఎస్ఆర్ బోర్డు తొలగించి, ఎన్టీఆర్ బోర్డు అమర్చారు. కార్యక్రమంలో మండల మాజీ కన్వీనర్ శ్రీరామలు యాదవ్, సర్పంచ్ శ్రీనివాసులు, నియోజకవర్గ ఉపాధ్యక్షులు కోనాపురం రామలింగ, త్రివేంద్ర, వాసుదేవరెడ్డి, బాబుల్ రెడ్డి, నారాయణనాయక్, ప్రతాప్, గోపి పాల్గొన్నారు.

పోస్టింగ్ కోసం పైరవీలు

- ముందు వరుసలో పోలీసు శాఖ
- ఎమ్మెల్యేను ప్రసన్నం చేసుకునేందుకు అధికారుల యత్నం
- ఇతర జిల్లాల నుంచి రావడానికి తీవ్ర ప్రయత్నాలు



హిందూపురం, జూన్ 9: సార్వత్రిక ఎన్నికలతో రాష్ట్రంలో ముఖచిత్రం మారింది. మొన్నటి వరకు అధికారంలో ఉన్న వైసీపీ ఘోర పరాజయం చవిచూపింది. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ఏర్పాటవుతోంది. మొన్నటివరకు వైసీపీ నాయకులు చెప్పిన మేరకు అధికారులు ఆయా నియోజకవర్గాల్లో పనిచేశారు. ఎన్నికల ముందు ఈసీ బదిలీలు చేపట్టింది. వాటిలో సైతం రాజకీయ జోక్యం మితిమీరిందనే చెప్పవచ్చు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బదిలీ అయిన అధికారులు సైతం నిబంధనలు పక్కన పెట్టి, వైసీపీ సేవలో తరించారు. దీంతో రాష్ట్రంలో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను సైతం పక్కన పెట్టింది. ఈ పరిస్థితుల్లో పోస్టింగ్ కోసం అధికారులు నూతనంగా గెలుపొందిన ఎమ్మెల్యేలు, ముఖ్యనేతల చుట్టూ తిరుగుతున్నారు. ప్రభుత్వం ఇలా మారిందో లేదో.. పోస్టింగ్ కోసం పైరవీలకు తెరలేపారు. పోలీసు శాఖలో పోటీ పడుతున్నారు. ప్రభుత్వం కొలువు తీరకుండానే పైరవీలు ముమ్మరం చేశారు. ఎన్నికల ఫలితాలు వెల్లడి కావడానికి ముందు నుంచి టీడీపీ అధికారంలోకి వస్తుందని భావించి కొంత మంది ప్రయత్నాలు ప్రారంభించారు. కూటమి గెలవడంతో మరింతమంది అధికారులు.. టీడీపీ ఎమ్మెల్యే వద్దకు క్యూ కడుతున్నారు. ఇప్పటికే అధికారులు కొన్నిరోజులు తమను ఇక్కడే ఉండనీయండని ప్రాధేయపడుతున్నారు. మరి కొంతమంది ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడికి రావడానికి పోటీ పడుతున్నారు.

ముందు వరుసలో పోలీసు శాఖ

సాధారణంగా పాలకపక్షం మారితే మొదట ఏ నాయకుడైనా కదిలించేది పోలీసులనే. మొన్నటి వరకు పోలీసు అధికారులు వైసీపీకి అనుకూలంగా వ్యవహరించారన్నది బహిరంగ రహస్యమే. కొంతమంది పోలీసు అధికారులైతే ఖాకీ చొక్కా వేసుకున్నామనే ఆలోచన కూడా లేకుండా వైసీపీతో అంటకాగారు. మొన్నటి వరకు వారు వ్యవహరించిన తీరు గుర్తుకు తెచ్చుకుంటే ఈ ప్రభుత్వంలో తమకు స్థానం ఉండదని ఫిక్స్ అయిపోయారు. ఈనేపథ్యంలో కొన్నిరోజులైనే ఇక్కడే ఉంచాలని కోరుతుండగా, మరికొన్ని నియోజకవర్గాల్లో ఇప్పటికే బదిలీల జాబితా సిద్ధం చేసినట్లు సమాచారం. ఇతర జిల్లాలో ఉన్నవారు రావడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఎందుకంటే గత ఐదేళ్లలో కొంత మంది పోలీసు అధికారులను వైసీపీ ప్రభుత్వం నానా ఇబ్బందులు పెట్టింది. టీడీపీ హయాంలో కొన్ని నియోజకవర్గాల్లో పనిచేసిన ఎస్ఐ నుంచి ఎస్పీ వరకు ఈ ఐదేళ్లలో ఇబ్బందులు పెట్టారు. కొంతమందినైతే లా అండ్ ఆర్డర్‌లో పనిచేయకుండా లూప్‌లైన్లో ఉంచారు. అలాంటి వారు తాము తీవ్రంగా నష్టపోయామనీ, కుటుంబాలకు సైతం దూరంగా ఉండాల్సిన పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు అవకాశం ఇవ్వాలని టీడీపీ నాయకులను కోరుతున్నారు.

బాలయ్యకు ఘన స్వాగతం

చిలమత్తూరు/హిందూపురం, జూన్ 9: హిందూపురం ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ సాధించి నియోజకవర్గానికి వస్తున్న నందమూరి బాలకృష్ణకు ఆదివారం సాయంత్రం చిలమత్తూరు మండలంలోని కొడికొండ చెక్‌పోస్టులో ఘన స్వాగతం లభించింది. బెంగళూరు నుంచి రోడ్డుమార్గాన కొడికొండ చెక్‌పోస్టుకు చేరుకున్న ఆయనకు కర్ణాటకలోని బాగేపల్లి సమీపాన టోల్‌గేట్ వద్ద వేలాదిమంది టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చి, స్వాగతం పలికారు. గజమాలతో ఆయనను సత్కరించారు. అడుగడుగునా ఆయనపై పూల వర్షం కురిపించారు. బాలయ్య.. కార్యకర్తలను ఆప్యాయంగా పలకరిస్తూ కరచాలనం చేశారు. స్వాగతం పలికిన వారిలో టీడీపీ మండల కన్వీనర్ రంగారెడ్డి, నాయకులు నాగరాజుయాదవ్, లక్ష్మీనారాయణ యాదవ్, బేకరీ గంగాధర్, సోమశేఖర్, గౌరీశంకర్, నందీషప్ప, అశ్వత్థప్ప, బాలాజీ, శ్రీదేవి, బయపరెడ్డి, జనసేన నాయకులు ప్రవీణ్, అగ్గి శ్రీనివాసులు ఉన్నారు.

హిందూపురంలో..

నందమూరి బాలకృష్ణకు హిందూపురంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగంత పలికారు. ఎమ్మెల్యే నివాసం వరకు ర్యాలీ చేపట్టారు. బాలకృష్ణకు శుభాకాంక్షలు తెలపడానికి పార్టీ నాయకులు, అధికారులు పెద్ద ఎత్తున తరలి రావడంతో ఎమ్మెల్యే నివాసం కిక్కిరిపోయింది. ఆయన.. నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.


కొడికొండ చెక్ పోస్టులో ఎమ్మెల్యే బాలకృష్ణకు స్వాగతం పలుకుతున్న టీడీపీ, జనసేన శ్రేణులు

ఆలోచింపజేసిన నాటిక


నాటికలోని సన్నివేశాలు


పాటలు పాడుతున్న భక్తులు



పుట్టపర్తి, జూన్ 9: సత్యసాయి సేవాసంస్థల యువత 'ఉదయ భూమిని సాగుచేయండి' అంటూ ప్రదర్శించిన నాటిక భక్తులను ఆలోచింపజేసింది. స్థానిక సాయికుల్వంత్ మందిరంలో రెండోరోజు ఆదివారం అనంతపురం జిల్లా సేవాసంస్థల ప్రతినిధులు సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగించారు. మొదట సాయిదర్శన్ పేరిట కచేరి నిర్వహించారు. సాయంత్రం యువత 'ఉదయ భూమిని సాగుచేయండి' నాటిక ద్వారా సత్యసాయి ప్రేమతత్వం, ఆధ్యాత్మిక బోధనల గురించి తెలియజేశారు. ఉదయం అనే భూమిలో ప్రేమ, సేవ అనే విత్తనాలు నాటి సాగుచేసి ప్రపంచానికి పంచాలంటూ నాటిక ద్వారా తెలియజేశారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 10-6-2024

Ananthapuramu | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | అనంతపురము సిటీ**

చేనుకు విత్తన పండుగ

మడకశిర రూరల్, జూన్ 9: చేనుకు విత్తన పండుగొచ్చింది. ఖరీఫ్‌లో విత్తన వేరుశనగ సాగుకు అదును కావడంతో రైతులు వేరుశనగ పంట సాగు చేసుకుంటున్నారు. మే నెలలో వర్షాలు కురవడంతో రైతులు పొలాలను దుక్కులు చేసుకున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు విత్తన సాగుకు మంచి అదును కావడంతో ఇప్పటికే పొలాలను సిద్ధ చేసుకున్న రైతులు ఆదివారం వేరుశనగ విత్తనాలు విత్తుకుంటున్నారు. మండలంలోని మెళవాయి, మాశేరొప్పం, గొల్లహట్టి, గొల్లపల్లి తదితర గ్రామాల్లో వేరుశనగ విత్తనం వేశారు.


మొళవాయి సమీపాన విత్తనం వేస్తున్నరైతులు




కేక్ కట్ చేస్తున్న కూటమి నాయకులు

మోదీ ప్రమాణంతో కూటమి సంబరాలు

పుట్టపర్తి, జూన్ 9: దేశ ప్రధానిగా నరేంద్రమోదీ మూడోసారి ఆదివారం ప్రమాణస్వీకారం సందర్భంగా కూటమి నేతలు సంబరాలు చేసుకున్నాయి. స్థానిక హనుమాన్ సర్కిల్‌లో బీజేపీ ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి, ఆనందం పంచుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ మాట్లాడుతూ.. దేశానికి ప్రపంచపటంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చిన ఘనత నరేంద్రమోదీదే అన్నారు. మూడోసారి ప్రమాణ స్వీకారం చేయనుండడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు సుదర్శన్, కత్తి రాజారెడ్డి, లాయర్ హరికృష్ణ, కొండమరాజు, సామకోటి ఆదినారాయణ, వీసీ గంగన్న పాల్గొన్నారు. ధర్మవరం పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్‌లో బీజేపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. భారీ స్క్రీన్ ఏర్పాటు చేసి, మోదీ ప్రమాణ స్వీకారాన్ని తిలకించారు.


ధర్మవరంలో భారీ స్క్రీన్‌పై మోదీ ప్రమాణ స్వీకారాన్ని తిలకిస్తున్న బీజేపీ శ్రేణులు

ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుందాం: యూటీఎఫ్

కొత్తచెరువు, జూన్ 9: రాష్ట్రంలో విద్యారంగం సమస్యలతో కొట్టుమిట్టాడుతోందనీ, సమష్టిగా కాపాడుకుందామని యూటీఎఫ్ నేతలు పిలుపునిచ్చారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం యూటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేశ్‌కుమార్ మాట్లాడుతూ.. విద్యారంగంలో నెలకొన్న అనేక సమస్యలను నూతన ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. 117 జీఓను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న 25 వేలకుపైగా ఉపాధ్యాయ పోస్టులను మెగా డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలన్నారు. ఇంకా ఎన్నో సమస్యలు పరిష్కరించాల్సి ఉందన్నారు. సమావేశంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రా రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుధాకర్, సహాధ్యక్షుడు బాబు, కోశాధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేశ్ కుమార్









ఉద్యోగుల సంతోషమే కూటమి ధ్యేయం: కందికుంట


కందికుంటకు శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

కదిరిఅర్బన్, జూన్ 9: ఉద్యోగుల సమస్యలు పరిష్కరించి, వారు సంతోషంగా ఉండేలా చేయడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పేర్కొన్నారు. కదిరి ఆర్టీసీ డిపోమేనేజర్ మైనొద్దీన్, అసిస్టెంట్ మేనేజర్లు హరి, రామ్మోహన్, కార్మిక సంఘం నాయకులు ఆదివారం కందికుంటను ఆయన నివాసంలో కలిశారు. పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను వివరించారు. ఇందుకు కందికుంట స్పందిస్తూ ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఉద్యోగులు ఆనందంగా ఉండడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.

కూటమి శ్రేణుల సంబరాలు


ఎన్పీకుంటలో కేక్ కట్ చేస్తున్న కూటమి నాయకులు

నంబులపూలకుంట, జూన్ 9: ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ మూడోసారి ఆదివారం ప్రమాణ స్వీకారం చేయడంతో మండలకేంద్రంలోని టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు సంబరాలు చేశారు. ఈ సందర్భంగా బస్టాండ్ ప్రాంతంలో కేక్‌ను కట్ చేసి అందరికీ పంచారు. పలువురు మాట్లాడుతూ దేశం మరింత అభివృద్ధిలో నడవాలంటే మోదీ లాంటి నాయకుడు కావాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్, బీజేపీ రాష్ట్ర మైనార్టీ కార్యవర్గ సభ్యుడు బాబ్‌జాన్, మండలాధ్యక్షుడు రామమోహన్, నాయకులు జయరాం, రాఘశరెడ్డి, రమణ, మోహన్‌రెడ్డి, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు


పాండురంగస్వామి ఆలయంలో పూజలు చేయిస్తున్న దృశ్యం

ధర్మవరం, జూన్ 9: ధర్మవరం ఎమ్మెల్యేగా సత్యకుమార్ యాదవ్ విజయం సాధించడంపై పట్టణంలోని కూటమి శ్రేణులు ఆదివారం స్థానిక పాండురంగస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో పాండురంగస్వామికి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం సత్యకుమార్‌పేరిట అర్చనలు చేయించారు. ఆలయం ఎదుట 101 టెంకాయల్ని కొట్టారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశేసుధాకర్, నాయకులు మాధవరెడ్డి, హోటల్ మారుతీస్వామి, సదాశివానంద, మాదన మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సత్యమ్మకు టీడీపీ శ్రేణుల పూజలు

ధర్మవరంరూరల్: ధర్మవరం ఎమ్మెల్యేగా సత్యకుమార్ గెలుపుపొందడంతో మండలంలోని కామిరెడ్డిపల్లి గ్రామంలో గల సత్యమ్మ ఆలయంలో ఆదివారం టీడీపీ నాయకులు మొక్కులు తీర్చుకున్నారు. సత్యమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం 101టెంకాయలు కొట్టి, జంతుబలులు బలిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో నాయకులు కామిరెడ్డిపల్లి బాలప్ప, నరసింహులు, అనిల్, అశోక్, సత్యమయ్య, నాగభూషణ, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కు తీర్చిన టీడీపీ శ్రేణులు

గాండ్లపెంట: కదిరి ఎమ్మెల్యేగా కందికుంట వెంకటప్రసాద్ విజయం సాధించడంతో మండలంలోని సాదులవాండ్లపల్లి వద్ద గల బోగాదమ్మ ఆలయంలో టీడీపీ నాయకులు మొక్కు తీర్చుకున్నారు. కత్తివారిపల్లికి చెందిన ఎంపీటీసీ సభ్యుడు జయరామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు బోగాదమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించి, టెంకాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు కార్యక్రమంలో రమణారెడ్డి, పరిమలమ్మ, క్రిష్ణ, రమేష్, చంద్ర, ఇసాక్, అంజనమ్మ, కిరణమ్మ, లక్ష్మీదేవి ఉన్నారు.

సల్లాపురమ్మ ఆలయంలో పూజలు

కదిరిఅర్బన్: కూటమి గెలుపుపై టీడీపీ శ్రేణులు సంబరాలు కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో మండలంలోని పట్నం గ్రామంలో సల్లాపురమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం గ్రామంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. బాణసంచా కాల్చుతూ, డీజే డ్యాన్సులు వేశారు. నాయకులు ఉప్పాల ప్రసాద్, మేడిశెట్టి లోకేష్, అశోక్, చంద్రశేఖర్, బాలాజీనాయక్, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మకు మొక్కులు..

ఓబుళదేవరచెరువు: రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రావడంతో పాటు పుట్టపర్తి ఎమ్మెల్యేగా పల్లె సింధూరారెడ్డి విజయం సాధించడంతో మండలంలోని టీడీపీ నాయకులు శేషయ్యగారిపల్లిలో గల గంగమ్మకు మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి జ్యోతులు, బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. శంకరయ్య, యనుముల గంగాధర్, గంగులప్ప, శ్రీనివాసులు, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయాల్లో పూజలు

ముదిగుబ్బ: రాష్ట్రంలో కూటమి ఘన విజయం సాధించడంతో మండలంలో కొండగట్టుపల్లి పంచాయతీ మద్దన్నగారిపల్లి గ్రామంలో కూటమి శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించి, 101టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం 10కేజీల కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. నాయకులు చినగాని నరసింహ యాదవ్, రమేష్‌బాబు, అశ్వర్థరెడ్డి, తుమ్మల మనోహర్, నాగిరెడ్డి, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అలాగే సానేవారిపల్లిలో టీడీపీ నాయకులు ఆంజనేయస్వామి ఆలయంలో 101టెంకాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు.

వైసీపీ హయాంలో అరకొరగా రేషన్ పంపిణీ

- బియ్యం, చక్కెరతోనే సరి
- నాలుగు నెలలుగా అందని కందిపప్పు
- మార్కెట్లో అధిక ధరలకు కొంటున్న పేదలు
- కూటమి ప్రభుత్వంపై ఆశలు



ఓబుళదేవరచెరువు, జూన్ 9: వైసీపీ ప్రభుత్వంలో రేషన్ కార్డు దారులు పూర్తిస్థాయిలో రేషన్ సరుకులు అందక ఇబ్బందులు పడ్డారు. విధిలేక బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వచ్చేది. వైసీపీ ప్రభుత్వం కేవలం బియ్యం మాత్రమే కేటాయించి, చేతులు దులుపుకుంది. చక్కెర ఒకనెల అటు ఇటుగా ఇస్తూ కాలాన్ని నెట్టుకొచ్చింది. గతంలో కందిపప్పు మొక్కుబడిగా పంపిణీ చేసేవారు. గత మార్చి నుంచి పూర్తిగా నిలిపేశారు. దీంతో రేషన్‌కార్డు దారులు చేసేదిలేక బహిరంగ మార్కెట్‌లో వాటిని కొనుగోలు చేసేవారు. అమడగూరు, ఓడీచెరువు మండలాలకు 125 క్వింటాళ్ల చెక్కర, 250 క్వింటాళ్ల కందిపప్పు రెవెన్యూ అధికారుల లెక్కల మేరకు పంపిణీ చేయాల్సి ఉంది. ఒక్కొక్క కార్డుదారుడికి కిలో కందిపప్పు రాయితీపై రూ.67లకు ఇవ్వాల్సి ఉంది. సరిగా పంపిణీ చేయలేదు. దీంతో బహిరంగ మార్కెట్‌లో మొదటి రకం కందిపప్పు రూ.180, రెండోరకం రూ.170 ధర పెట్టి కొనుగోలు చేయాల్సి వచ్చేది.

కనిపించని కందిపప్పు

అమడగూరు, ఓడీసీ మండలాలకు కలిపి ప్రభుత్వ రేషన్ సరుకుల గోడౌన్ ఓడీసీలో ఉంది. ఇక్కడి నుంచి రెండు మండలాలకు సరుకులను సరఫరా చేయాలి. నెలకు రెండు మండలాలకు కలిపి 250క్వింటాళ్ల కందిపప్పును సరఫరా చేయాల్సి ఉంది. అయితే గత మార్చినుంచి సరఫరా చేయలేదు. కేవలం బియ్యం, చక్కెర మాత్రమే అందించారు. మార్చికి ముందుకూడా అరకొరగానే కందిపప్పు సరఫరా చేశారు. కొంతమంది డీలర్లు వాటిని కూడా సరఫరా చేయలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

జూన్‌లో కూడా తప్పని పరిస్థితి

జూన్ నెలలో కూడా కందిపప్పు రాకపోవడంతో డీలర్లు కేవలం బియ్యం, చక్కెర మాత్రమే సరఫరా చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం కార్డుదారులకు గోధుమపిండి కూడా అందిస్తామని చెప్పారు. ఏదీ సక్రమంగా ఇవ్వలేక పోయారు.

కొత్త ప్రభుత్వంపై ఆశలు

ప్రస్తుతం కూటమి అధికారంలోకి రావడంతో కార్డు దారులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. సక్రమంగా కందిపప్పు ఇస్తుందని లబ్ధిదారులు ఆశాభావం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలా కాకుండా కూటమి ప్రభుత్వం బియ్యం, చక్కెరతోపాటు జూలై నెలలో కందిపప్పుకూడా తప్పకుండా ఇస్తారని కార్డుదారులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

కందిపప్పు ఇవ్వాలి



వైసీపీ ప్రభుత్వం కందిపప్పు సరఫరా లేకుండా చేసింది. దీంతో బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.180పెట్టి కొనుగోలు చేయాల్సి వస్తోంది. కూటమి ప్రభుత్వం వచ్చే నెలనుంచి కందిపప్పు సరఫరా చేసేలా చూడాల్సి ఉంది.

బీ. సులోచన, పెద్ద గుట్లపల్లి

కందిపప్పు కొనాలంటే గగనం



ప్రస్తుతం నిత్యావసరవస్తువులు కొనుగోలు చేయడం గగనమైంది. గత కొన్ని నెలలుగా కందిపప్పును స్టోర్లలో ఇవ్వడం లేదు. దీంతో బయట మార్కెట్లో అధిక ధరకు కొనుగోలు చేస్తున్నాం. ఇది మాలాంటి పేదలకు గగనమవుతోంది. కూటమి ప్రభుత్వం పేదల సమస్యలు గమనించి స్టోర్లలో కందిపప్పు సరఫరా చేయాలి.

- ఆర్. గీత, నారప్పగారపల్లి

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో సాయిదివ్యతేజారెడ్డికి 175వ ర్యాంకు


సాయి దివ్యతేజారెడ్డి

నంబులపూలకుంట, జూన్ 9: మండలంలోని అల్లుగుట్టివారిపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న శ్రీనివాసులరెడ్డి కుమారుడు సాయిదివ్యతేజారెడ్డి ఆదివారం వెలువడిన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో 175వ ర్యాంకు సాధించాడు. ఈయన హైదరాబాద్‌లోని ఆకాష్ జూనియర్ కాలేజీలో ఇంటర్ పూర్తి చేశారు. జేఈఈ మెయిన్స్ రాసి ప్రతిభ చూపాడు. అనంతరం అడ్వాన్స్‌డ్ రాసి అందులోనూ ర్యాంక్ సాధించాడు. ఇతడిని ఎంఈఓలు గోపాల్‌నాయక్, సుబ్బిరెడ్డి, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్ తదితరులు అభినందించారు.

ముజిమిల్‌కు 823 ర్యాంకు


ముజిమిల్‌కు స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు

గాండ్లపెంట, జూన్ 9: మండలంలోని తాళ్లకాలువ గ్రామానికి చెందిన ముజిమిల్ జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో 823వ ర్యాంక్‌ను సాధించారు. తల్లిదండ్రులు కరీముల్లా, నజావత్‌కౌసర్ అనంతపురంలో ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. ముజిమీల్ గుడివాడలో పదోతరగతి, ఇంటర్ హైదరాబాద్ నారాయణ కళాశాలలో చదివినట్లు చెప్పారు. ర్యాంక్ సాధించిన ముజిమీల్‌కు తల్లిదండ్రులు స్వీటు తినిపించి అభినందించారు.

గుండెపోటుతో టీడీపీ సానుభూతిపరుడు మృతి

కొత్తచెరువు, జూన్ 9: మండలంలోని ఇరగంపల్లి గ్రామానికి చెందిన టీడీపీ సానుభూతి పరుడు బోయగంగాద్రి(50) గుండెపోటుతో మృతి చెందారు. తాపీ మేస్త్రీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునే ఈయన టీడీపీ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనేవారు. కాగా పోతులకుంటలో ఆదివారం మధ్యాహ్నం తాపీపని చేస్తుండగా.. ఛాతీలో నొప్పిరావడంతో ఒక్కసారిగా కుప్పకూలాడు. తోటి కార్మికులు వెంటనే కొత్తచెరువు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. ఈయనకు భార్య రమణమ్మ, కుమార్తె, కుమారుడు సంతానం.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


పట్నం జడ్పీ హైస్కూల్లో నాటి గురువులతో పూర్వ విద్యార్థులు


నల్లమాడలోని హైస్కూల్లో పూర్వ విద్యార్థులు

కదిరిఅర్బన్, జూన్ 9: మండలంలోని పట్నం జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో 2013-2014వ విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు 10 ఏళ్ల తర్వాత అందరూ ఒక్కచోట కలిసి ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఒకరినొకరు యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. నాటి గురువులు చింతా నాగరాజు, వెంకటేష్, మోహన్‌రెడ్డి, శ్రీనివాసులు, చంద్రశేఖర్, దివాకర్‌రెడ్డిని పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నవీన్, హరి, సమరసింహ, రవీంద్ర, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నల్లమాడ: మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో 1999-2000లో పదోతరగతి చదివిన విద్యార్థులు ఆదివారం గెట్‌టూగెదర్ నిర్వహించారు. 25 ఏళ్ల తర్వాత వారందరూ అదే పాఠశాలలో కలిశారు. ఒకరినొకరు యోగక్షేమాలను అడిగి కలిశారు. నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అప్పటి హెచ్‌ఎం నాగిరెడ్డిని, ఉపాధ్యాయులు లక్ష్మణ, జయరామిరెడ్డి, లక్ష్మయ్య, ప్రతాప్‌రెడ్డి, హుస్సాన్, సబహాన్, వెంకటరామిరెడ్డి, గంగరాజులను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు లోకేశ్వర్‌రెడ్డి, రమేష్‌యాదవ్, శ్రావన్, ప్రదీప్, శ్రీనాథ్, సోము, ఆనందరెడ్డి, నరసింహారెడ్డి, ప్రతాప్, ప్రియాంక, విద్య, సునిత, హారతి తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం: పట్టణంలోని సంజయ్‌నగర్ బీఎస్ఆర్ మున్సిపల్ బాలుర ఉన్నతపాఠశాలలో 1997-98వ విద్యాసంవత్సరంలో పదోతరగతి చదివిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 28 ఏళ్ల తర్వాత వారంతరూ అదే పాఠశాలలో కలిశారు. ఒకరినొకరు యోగక్షేమలు అడిగి తెలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. నాటి గురువులు సత్యనారాయణబాబు, శ్రీనివాసరావు, నాగభూషణ, యజ్ఞన్న, పార్థసారధి, కృష్ణప్రసాద్, లక్ష్మీనారాయణలను సన్మానించారు.

ప్రాచీన కళలను ప్రోత్సహించాలి: డీఈఓ



కళాకారులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న డీఈఓ మీనాక్షి

ధర్మవరం, జూన్ 9: భారతీయ ప్రాచీన కళలను ప్రతిఒక్కరూ ప్రోత్సహించాలని డీఈఓ మీనాక్షి సూచించారు. పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో ఆదివారం శ్రీలలిత నాట్యకళానికేతన్ ఆధ్వర్యంలో నాట్య వేసవి శిక్షణ ముగింపు కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథులుగా డీఈఓతోపాటు అనంతపురం లలిత కళాపరిషత్ చైర్మన్ పద్మజ, ఆంధ్రప్రదేశ్ సకల కళా వృత్తి సంఘం అధ్యక్షుడు ఆనంద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ... తల్లిదండ్రులకు పిల్లలకు చదువుతో పాటు భారతీయ ప్రాచీన కళలను నేర్పించాలన్నారు. మన సాంప్రదాయమైన కళలను నేర్చుకున్నప్పుడే ఉన్నతమైన స్థానం లభిస్తుందన్నారు. ఇప్పటికే ప్రపంచ స్థాయిలో మన భారతీయ కళలకు ఎంతగానో గుర్తింపు ఉందన్నారు. అనంతరం ముఖ్యఅతిథుల చేతుల మీదుగా 50 మంది నాట్య కళాకారులకు సర్టిఫికెట్లు, మెడళ్లు అందజేశారు. కార్యక్రమంలో లలితా నాట్యనికేతన్ గురువులు బాబూబాలాజీ, కమలాబాలాజీ, రామలాలిత్య పాల్గొన్నారు.

ఘనంగా రామాలయ వార్షికోత్సవం

తనకల్లు, జూన్ 9: మండలంలోని వంకపల్లి గ్రామంలోగల రామాలయ మొదటి వార్షికోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్మాణం చేపట్టి యేడాది పూర్తి కావడంతో.. గ్రామస్థులు ఉమ్మడిగా వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు ఆలయంలోని సీతారామలక్ష్మణ, ఆంజనేయ స్వామి మూలవిరాట్‌లకు ప్రత్యేక అలంకరణలు, పూజలు చేశారు. స్థానికులతో పాటు సమీప గ్రామాల ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ధర్మవరం, జూన్ 9: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాలలో ఆదివారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బెంగళూరుకు చెందిన శంకర కంటి ఆస్పత్రి, జిల్లా అంధత్వ నివారణసంస్థ వారి సహకారంతో ఉచిత కంటి వైద్యశిబిరం జరిగింది. ఇందులో 170 మందికి వైద్యనిపుణులు కంటి పరీక్షలు నిర్వహించి 117 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపికచేశారు. క్యాంపు చైర్మన్‌కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

గాండ్లపెంట, జూన్ 9: మండలంలోని కదిరి, రాయచోటి ప్రధాన రహదారిలో కోటపల్లి వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలకేంద్రానికి చెందిన అలాం, ఇమ్రాన్ బైక్‌లో కదిరికి వెళ్తున్నారు. కాగా కోటపల్లి వద్ద వారి బైక్‌ను ఎదురుగా కారు వచ్చి ఢీకొంది. ఈప్రమాదంలో అలాం, ఇమ్రాన్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు 108లో కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

యువకుడి ఆత్మహత్య

కదిరి, జూన్ 9: అమడగూరు మండలం జౌకల గ్రామంలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ మగ్బుల్ తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. జౌకల గ్రామానికి చెందిన రఘునాథరెడ్డి కుమారుడు వేణుగోపాల్‌రెడ్డి (20) ఓ అమ్మాయిని ప్రేమించాడు. కాగా ఆమెకు ఇటీవల వివాహమైంది. అప్పటినుంచి ఇతను తీవ్ర మనోవేదనకు గురయ్యేవాడు. గత రెండురోజుల క్రితం తల్లిదండ్రులు ఊరికెళ్లారు. ఈ క్రమంలో ఇంటిలో ఎవరు లేకపోవడంతో ఆదివారం ఇంటి దూలానికి చీరతో ఉరివేసుకుని మృతిచెందాడు. ఊరినుంచి తిరిగి వచ్చిన తల్లిదండ్రులు విషయాన్ని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని, మృతదేహాన్ని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని ఎస్ఐ చెప్పారు.

నరేంద్రమోదీ ప్రమాణ స్వీకారం..

- బీజేపీ శ్రేణుల సంబరాలు

ధర్మవరం, జూన్ 9: నరేంద్రమోదీ మూడోసారి ప్రధానమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్‌లో బీజేపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మోదీ ప్రమాణ స్వీకారం తిలకించడానికి భారీ స్క్రీన్ ఏర్పాటుచేశారు. బాణసంచా కాల్చారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. దేశాన్ని నరేంద్రమోదీ ఎంతో అభివృద్ధి చేశారని, భవిష్యత్తులో కూడా మరిన్ని పథకాలు ప్రవేశపెట్టి అభివృద్ధి చేస్తారని తెలిపారు. చంద్రబాబు కూడా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తారని చెప్పారు. ఇక ధర్మవరం నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే సత్యకుమార్ కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రూపురేఖలు మార్చుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు జింకాచంద్రశేఖర్, నాయకులు సాకే ఓబులేశు, అసెంబ్లీ కన్వీనర్ గంగులకుంట గోపాల్‌రెడ్డి, చేనేత సెల్ రాష్ట్ర సభ్యుడు గుండాపుల్లయ్య, నాయకులు పాల్గొన్నారు.

తనకల్లు, జూన్ 9: ప్రధానిగా నరేంద్రమోదీ మూడో సారి ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా మండలకేంద్రంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద బీజేపీ నాయకులు ఆదివారం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మైనార్టీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు బాబాఫక్రుద్దీన్, నాయకులు నరేష్, లక్ష్మీనారాయణ, సురేంద్ర, బాలాజీ, జానకిరామ్ కార్యకర్తలు పాల్గొన్నారు.


తనకల్లులో కేక్ కట్ చేస్తున్న బీజేపీ నాయకులు

నేడు పురంలో బాలయ్య జన్మదిన వేడుకలు

హిందూపురం, జూన్ 9: ప్రముఖ సినీ నటుడు ఎమ్మెల్యే బాలకృష్ణ తన 64వ జన్మదిన వేడుకలను ఈ సారి టీడీపీ నాయకులు, కార్యకర్తల మధ్య జరుపుకోవాలని ఆయన నిశ్చయించుకున్నారు. దీంతో ఆదివారం సాయంత్రానికే ఆయన హిందూపురానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు నాయకులు, కార్యకర్తలు ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన తన జన్మదినం సందర్భంగా సోమవారం ఉదయం 8. 30 గంటలకు పట్టణంలోని సూగూరు ఆంజినేయస్వామి ఆలయంలో జరిగే ప్రత్యేక పూజల్లో పాల్గొంటారు. అలాగే 10 గంటలకు తన నివాసం వద్ద ఎన్టీఆర్ ఆరోగ్య రథన్ని పునఃప్రారంభిస్తారు. 10.15 గంటలకు ఆర్టీసీ బస్టాండు వద్ద అన్నదానం కార్యక్రమంలో పాల్గొంటారు. 10.25 గంటలకు అన్న క్యాంటిన్‌ను ప్రారంభించి అక్కడ నుంచి ర్యాలీతో జేవీఎస్ ఫంక్షన్ హాలుకు చేరుకుంటారు. అక్కడ 64 కిలోల భారీ కేక్‌ను కట్ చేయనున్నారు. కార్యక్రమాన్ని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో జరపనున్నట్లు తెలిపారు. ఉదయం ఎమ్మెల్యే తన నివాసంలోనే నాయకులకు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు. ఈ సందర్భంగా అధికారులు, నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలుపనున్నట్లు టీడీపీ నాయకులు ఓ ప్రకటనలో తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య


గొల్ల సోమశేఖర్ మృతదేహం

పెనుకొండ రూరల్, జూన్ 9: సోమందేపల్లి మండలం బుస్సయ్యగారి పల్లిలో గొల్ల సోమశేఖర్(45) అనే వ్యక్తి శనివారం రాత్రి కుటుంబ సమస్యలతో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని బుస్సయ్యగారి పల్లికి చెందిన సోమశేఖర్, గొర్రెలు మేపుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. కుటుంబ సభ్యులు, బంధువులు, పెద్దలతో కలిసి ఆయన ఈ నెల 16న ఓ యువకుడితో కూతురి నిశ్చితార్థం చేసేందుకు నిశ్చయించారు. అయితే ఆమె ప్రేమించిన యువకుడితో వెళ్లిపోయింది. దీంతో మనస్థాపం చెందిన సోమశేఖర్ చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అతడు చెట్టుకు వేలాడుతున్న విషయాన్ని ఆదివారం ఉదయం గుర్తించిన స్థానికులు కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పెనుకొండ ప్రభుతాసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ మురళికృష్ణ తెలిపారు. మృతుడికి భార్య రంగమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

గుజరాత్ వాసి ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, జూన్ 9: మండలంలోని పాలసముద్రం సమీపంలోని కేఎస్ ఎంటర్‌ప్రైజెస్ పరిశ్రమలో పనిచేస్తున్న గుజరాత్‌కు చెంది కార్మికుడు ఇషరాప్‌మాలిక్ ఆదివారం విషద్రావకం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గుజరాత్‌లోని గణేష్‌పురాకు చెందిన ఇషరాప్‌మాలిక్ కొంతకాలంగా పాలసముద్రం వద్ద ఉన్న పరిశ్రమలో పనిచేస్తున్నాడు. అతడు విషద్రావకం తాగి అస్వస్థతకు గురికాగా తోటి కార్మికులు గోరంట్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. డాక్టర్ ఉషా వైద్యచికిత్సలు అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో హిందూపురం తీసుకెళ్లారు. అతడి ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియరాలేదు.

మరో మహిళ...

గోరంట్ల, జూన్ 9: మండలంలోని గుమ్మయ్యగారిపల్లికి చెందిన శంకరమ్మ కుటుంబ కలహాలతో ఆదివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గ్రామానికి చెందిన బండప్ప, శంకరమ్మ దంపతుల మధ్య నెలకొన్న వివాదం కారణంగా మనస్థాపానికి గురైన ఆమె ఎక్కువ మోతాదులో మాత్రలు మింగింది. దీంతో అస్వస్థతకు గురైన ఆమెను గోరంట్ల ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా డాక్టర్ ఉషా చికిత్సలు చేశారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం హిందూపురం తరలించాల్సి ఉండగా 108 వాహనం ఆలస్యంగా వస్తుందని తెలిసి, ప్రయివేటు వాహనంలో తీసుకెళ్లారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గాండ్లపెంట, జూన్ 9: మండలపరిధిలోని కదిరి, రాయచోటి ప్రధాన రహదారిలోని కోటపల్లి వద్ద ఆదివారం కారు, ద్విచక్రవాహనం కున్నాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు కదిరికి ద్విచక్రవాహనంలో వెళ్తున్న అలాం, ఇమ్రాన్లు కోటపల్లి వద్ద కారు ఎదురుగా వచ్చి ఢీకున్నట్లు చెప్పారు. ఈప్రమాదంలో అలాం, ఇమ్రాన్‌కు కుడి కాళ్లు విరగడంతోపాటు పలుచోట్లు తీవ్రగాయాలైనట్లు తెలిపారు. 108కు స్థానికులు ఫోన్ చేసి, కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పైప్‌లైన్ మార్చేందుకు రోడ్డును తవ్వారు

- రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- ఐదు రోజులుగా నీరు రావడం లేదని ఆగ్రహం


పైప్‌లైన్ కోసం రోడ్డును అడ్డంగా తవ్వేసిన దృశ్యం

హిందూపురం అర్బన్, జూన్ 9: తాగునీటి పైప్‌లైన్ మార్చాలని రోడ్డును తవ్వడంతో నడిచేందుకు దారిలేక, కొళాయిలకు నీరు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పట్టణ పరిధిలో మేళాపురం ఎస్‌బీఐ కాలనీలోని ఓ ప్రాంతం వారు మండిపడుతున్నారు. పట్టణ పరిధిలో మేళాపురం ఎస్‌బీఐ కాలనీలో ఎక్కువగా ఉద్యోగులే నివాసముంటున్నారు. అయితే కాలనీలోని వినాయక దేవస్థానం పక్కవీధిలో ఓ వ్యాయామ ఉపాధ్యాయుడు ఇంటి నిర్మాణం చేపట్టాడు. ఇప్పుడు పూర్తి కావచ్చింది. అయితే ఇంటి నిర్మాణం కింద కాలనీ ప్రజలకు నీటిని సరఫరా చేసే మునిసిపల్ లైను ఉంది. అది ఇంటి యజమానికి ముందే తెలుసో, లేదో కానీ... ఆ పైప్‌లైన్ నుంచి నీరు లీకేజీ అవుతోందని, పైప్‌లైన్ మార్చాలని మునిసిపల్ ఏఈ జనార్దన్ వెళ్లి విన్నవించినట్లు సమాచారం. దీంతో ఏఈ అక్కడికి వచ్చి పరిశీలించారు. ఇంటి పక్కనే తవ్వి పైప్ లైన్‌ను అక్కడికి మార్చాలని ఇంటి యజమానికి సూచించారు. దీంతో ఇంటి యజమాని మూడు రోజుల కిందట రోడ్డును తవ్వేశాడు. ఇప్పటి వరకు పూర్తి చేయలేదు. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మునిసిపల్ అధికారులు దగ్గరుండి చేయాల్సిన పనిని ఇంటియజమానికే అప్పజెప్పడం ఏమిటని మండిపడుతున్నారు. రోడ్డును ఇలా అడ్డదిడ్డం గా తవ్వేస్తే మరలా సీసీ రోడ్డును ఎవరు నిర్మిస్తారని నిలదీస్తున్నారు.

అనుమతులు ఎలా ఇచ్చారు? : కాలనీకి నీరందించే పైప్ లైను ఉన్న ప్రాంతంలో ఇల్లు కట్టడానికి టౌన్ ప్లానింగ్ అధికారులు అనుమతులు ఎలా ఇచ్చారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. టౌన్ ప్లానింగ్, వాటర్ ప్లానింగ్ అధికారులు ముడుపులు తీసుకుని అనుమతులు ఇచ్చి ఉంటారని విమర్శిస్తున్నారు. అదే విధంగా దీనిపై పరిశీలించేందుకు వచ్చిన మున్సిపల్ నీటి విభాగం ఏఈ తదితరులను ఈ విషయంపై నిలదీశారు. రోడ్డును ఆక్రమించి ఇంటిని నిర్మిస్తున్నా ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నింరు. అధికారుల తప్పిదం వల్ల ఐదు రోజులుగా కొళాయిలకు నీరు రాకపోవడంతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం సాయంత్రం లోగా కాలనీకి నీరందించకపోతే రోడ్డుపై కూర్చుని నిరసన తెలుపుతామని హెచ్చరించారు.

ఐదు రోజులుగా నీరు రాలేదు

ఎస్‌బీఐ కాలనీకి నీరు రాక ఐదు రోజులు కావస్తోంది. కాలనీకి నీరందించే పైప్‌లైన్‌ను తొలగించడంతో నీరు రాలేదని తెలుస్తోంది. మునిసిపల్ నీటి సరఫరా సిబ్బంది, ఇంజనీరింగ్ సెక్షన్ అధికారులు స్పందించి కాలనీకి నీరందించాలి. లేని పక్షంలో స్థానికులతో కలిసి మునిసిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేపడుతాం.

- లక్ష్మీదేవి, ఎస్‌బీఐ కాలనీ

ఇల్లు కట్టిన తరువాత తెలిపాడు

ఎస్‌బీఐ కాలనీలో దాదాపు 30 ఏళ్ల క్రితం నీటి సరఫరా పైప్ లైన్ వేశారు. అయితే నీటిని సరఫరా చేస్తే నూతనంగా నిర్మించిన ఇంటి లోకి నీరు వస్తోంది. ఈ విషయ ఇల్లు నిర్మించిన తరువాత తెలిసిందని యజమాని మాకు తెలిపారు. దీంతో సమస్య వచ్చింది. లీకేజీవల్ల ఎస్‌బీఐ కాలనీ వాసులకు నీరు అందించడంలో అంతరాయం ఏర్పడింది.

- జనార్దన్, ఏఈ, మునిసిపల్ నీటి సరఫరా విభాగం


అధికారులు, ఇంటి యజమానిని నిలదీస్తున్న స్థానికులు

హిందూపురంలో మళ్లీ నీటికి కటకట

విద్యుత్ సమస్యతోనే అంటున్న అధికారులు

హిందూపురం అర్బన్, జూన్ 9: ఒకప్పుడు రాష్ట్రంలో నీటి సమస్య అధికంగా ఉన్న ప్రాంతాల్లో హిందూపురం పట్టణం ఒకటి. దీంతో ఏ అధికారి అయిన హిందూపురం రావాలంటే భయపడే వారు. అయితే గతంలో నందమూరి బాలకృష్ణ చొరవ తీసుకుని రూ. 194 కోట్లతో గొల్లపల్లి నుంచి ప్రత్యేక పైప్ లైన్ ఏర్పాటు చేసి పుర ప్రజల దాహార్తి తీర్చారు. దీంతో 2014 నుంచి పురానికి నీటి సమస్య తీరింది. అయితే గొల్లపల్లి నుంచి నాలుగు చోట్ల ఎత్తిపోతల పథకం ద్వారా హిందూపురానికి నీరు రావాల్సి ఉంటుంది. గొల్లపల్లి నుంచి ఎస్‌కేడీకి, అక్కడి నుంచి యూకేడీకి , యూకేడీ నుంచి కొట్నూరు పంపింగ్ హౌస్‌కు నీరు చేరాలి. అయితే ఇటీవల కాలంలో గొల్లపల్లి లిఫ్ట్ ఇరిగేషన్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయం తీవ్రంగా మారింది. ఇటీవలి కాలంలో తరచూ విద్యుత్ ప్యానల్ బోర్డు తదితర చోట్ల సమస్య ఉత్పన్నమవుతోంది. ఈవిషయం విద్యుత్ శాఖ అధికారులకు తెలిసినా పట్టించువడంకోలేదని మునిసిపల్ నీటి సరఫరా విభాగం ఇంజనీర్లు మాట్లాడుకోవడం విశేషం. ఇప్పటికే వారం రోజుల్లో మూడు సార్లు నీటి సరఫరాకు సంబంధించి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. మరలా శనివారం నుంచి సమస్య మొదటికి వచ్చింది. దీంతో హిందూపురానికి నీరు సరఫరా చేయాలంటే మరో మూడు రోజులు పట్టవచ్చని మునిసిపల్ ఇంజనీరింగ్ అధికారులు అంటున్నారు.

మరో మూడు రోజులు పట్టొచ్చు

గొల్లపల్లి నుంచి నీరు సరఫరా అందించాలంటే విద్యుత్ సరఫరా సక్రమంగా ఉండాలి. ఇటీవల విద్యుత్ సమస్య తలెత్తింది. దీంతో హిందూపురానికి నీటిని సకాలంలో అందించలేకపోతున్నాం. ఎతిపోతల పథకం ఉన్న మూడు చోట్ల కరెంట్ ఉంటేనే నీటని లిఫ్ట్ చేయగలం. విద్యుత్ సమస్య కారణంగా నీరు సరఫరా కావాలంటే మరో మూడు రోజులు పట్టవచ్చు.

- బాలసుబ్రహ్మణ్యం, డీఈ, మునిసిపల్ శాఖ

రామోజీరావు మృతికి పాత్రికేయుల సంతాపం


రామోజీరావుకు నివాళులర్పిస్తున్న పాత్రికేయులు

గోరంట్ల, జూన్ 9: ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు ఆత్మకు శాంతి చేకూరాలని గోరంట్లలో పాత్రికేయులు ఆదివారం సంతాపం వ్య క్తం చేశారు. ఆయన అనారోగ్యంతో శనివారం మృతిచెందిన విషయం విది తమే. దీంతో గోరంట్లలోని పాత్రికేయులు సంతాప సభ నిర్వహించారు. అనంతరం గాంధీ సర్కిల్ నుంచి బస్టాండ్ కూడలిలోని అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఆయనకు నివాళులర్పించి, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకున్నారు.

టీడీపీ విజయోత్సవాలు

- పార్టీ ఆవిర్భావం నుంచి పుర ప్రజలు టీడీపీకే పట్టం: వక్తలు


పురంలో కేక్ కట్ చేసి సంబరాలు జరవుకుంటున్న దృశ్యం

హిందూపురం అర్బన్, జూన్ 9: టీడీపీ ఆవిర్భావం నుంచి హిందూపురం ప్రజలు టీడీపీకే పట్టం కడుతున్నారని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని జేవీఎస్ ఫ్యాలెస్‌లో ఆదివారం టీడీపీ సీనియర్ నాయకుడు జేఈ వెంకటస్వామి ఆధ్వర్యంలో విజయోత్సవ సభ ఏర్పా టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నందమూరి బాలకృష్ణ హిందూపురం నుంచి ముచ్చటగా మూడోసారి గెలుపొంది హ్యాట్రిక్ బాలయ్యగా నిలిచారని పొగడ్తలతో ముంచెత్తారు. అప్పట్లో ఎన్టీఆర్, ఇప్పుడు బాలయ్య పురం నుంచి హ్యాట్రిక్ సాధించారని గుర్తు చేశారు. హిందూపురం అంటే నందమూరి పురంగా రాష్ట్రమంతా చెప్పుకుంటున్నారన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం విదుభోజనం ఏర్పాటు చేశారు. బాలయ్య వ్యక్తిగత కార్యదర్శి సురేంద్ర, రాజకీయ కార్యదర్శి శ్రీనివాసరావు, జేవీ అనిల్‌కుమార్, టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, పట్టణాధ్యక్షుడు డీఈ రమేష్, దేమకేతేపల్లి అంజినప్ప, బేవనల్లి ఆనంద్, జనసేన ప్రవీన్, ఆర్ఎంఎస్ షఫీ, లేపాక్షి మండల కన్వీనర్ జయప్ప, హిందూపురం మండల కన్వీనర్ అశ్వత్థరెడ్డి, చిలమత్తూరు మండల కన్వీనర్ రంగారెడ్డి వందలాది మంది నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

రొళ్ల: మండలంలోని ఎం రాయాపురం, దాసప్పపాళ్యం, బీజీ హళ్లిల్లో టీడీపీ విజయోత్సవ ర్యాలీలు నిర్వహించారు. హిందూపురం పార్లమెంటు ఎంపీగా పార్థసారథి, మడకశిర ఎమ్మెల్యే స్థానానికి ఎంఎస్ రాజు గెలవడంతో గ్రామాల్లో పెద్ద ఎత్తున టపాసులు కాల్చి సంబరాలు చేసుకొన్నారు. డప్పు వాయిద్యాలు, డీజే డ్యాన్సులు చేస్తూ ర్యాలీలు నిర్వహించారు. ఎంరాయాపురం గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ దాసిరెడ్డి, రాష్ట్ర కుంచిటిగ వక్కలిగ సాధికార కన్వీనర్ పీఎం పాండురంగప్ప, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గురుమూర్తి, మాజీ జడ్పీటీసీ సన్నతిమ్మప్ప, వైస్ ఎంపీపీ సిద్దగంగప్ప, ప్రధాన కార్యదర్శి ఈరన్న, ఎంపీపీ కిష్టప్ప, హొట్టేబెట్ట శ్రీనివాస్, మారుతీ, భరత్, రామకృష్ణ, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


రాయాపురంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

పెనుకొండ రూరల్, జూన్ 9: పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్‌లో రోడ్డు దాటుతూ లారీ ఢీకొన్న సంఘ టనలో తీవ్రంగా గాయపడిన రామాంజనేయులు (47) అనే వ్యక్తి శనివారం రాత్రి మృతిచెందినట్లు హెడ్ కాని స్టేబుల్ దాదాపీర్ తెలిపారు. మండలంలోని వెంకటరెడ్డి పల్లికి చెందిన రామాంజినేయులు శనివారం సాయంత్రం పని నిమిత్తం పెనుకొండకు వచ్చి ఎన్టీఆర్ సర్కిల్ లో రోడ్డు దాటుతుండగా.... కర్ణాటక రాష్ట్ర తుమకూర్ నుంచి తాడిపత్రికి ఐరన్ లోడ్‌తో వెళ్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో రామాంజనేయులు కాలు, చెయ్యి నుజ్జునుజ్జు అయింది. స్థానికుల సమాచారం మేరకు 108లో అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు. ఈ ఘటనపై లారీ డ్రైవర్ వెంకటేష్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రాచీన కళలను ప్రోత్సహించాలి: డీఈఓ

ధర్మవరం,జూన్ 9: భారతీయ ప్రాచీన కళలను ప్రతిఒక్కరూ ప్రోత్సహించాలని డీఈఓ మీనాక్షి సూచించారు. పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో ఆదివారం శ్రీలలిత నాట్యకళానికేతన్ ఆధ్వర్యంలో నాట్య వేసవి శిక్షణ ముగింపు కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథులుగా డీఈఓతోపాటు అనంతపురం లలిత కళాపరిషత్ చైర్మన్ పద్మజ, ఆంధ్రప్రదేశ్ సకల కళావృత్తి సంఘం అధ్యక్షుడు ఆనంద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ... తల్లిదండ్రులకు పిల్లలకు చదువుతోపాటు భారతీ య ప్రాచీన కళలను నేర్పించాలన్నారు. మన సంప్రదాయ కళలను నేర్చుకున్నప్పుడే ఉన్నతమైన స్థానం లభిస్తుం దన్నారు. ఇప్పటికే ప్రపంచ స్థాయిలో మన భారతీయ కళలకు ఎంతగానో గుర్తింపు ఉందన్నారు. అనంతరం ముఖ్యఅతిథుల చేతుల మీదుగా 50 మంది నాట్య కళాకారులకు సర్టిఫికెట్లు, పతకాలు అందజేశారు. కార్యక్రమంలో లలితా నాట్యనికేతన్ గురువులు బాబూబాలాజీ, కమలాబాలాజీ, రామలాలిత్య పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

కదిరి, జూన్ 9: అమడగూరు మండలం జౌకల గ్రామంలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ మగ్బుల్ తెలిపారు. జౌకల గ్రామానికి చెందిన రఘునాథ రెడ్డి కుమారుడు వేణుగోపాల్‌రెడ్డి (20) ఓ అమ్మాయిని ప్రేమించాడు. కాగా ఆమెకు ఇటీవల వివాహం అయింది. అప్పటినుంచి ఇతను తీవ్ర మనోవేదనకు గురయ్యేవాడు. గత రెండురోజుల క్రితం తల్లిదండ్రులు ఊరికెళ్లారు. ఈ క్రమంలో ఇంటిలో ఎవరు లేకపోవడంతో ఆదివారం ఇంటి దూలానికి చీరతో ఉరివేసుకుని మృతిచెందాడు. ఊరినుంచి తిరిగి వచ్చిన తల్లిదండ్రులు విషయాన్ని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని, మృతదేహాన్ని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని ఎస్ఐ చెప్పారు.

ఇంటింటా స్వీట్ల పంపిణీ

మడకశిర రూరల్, జూన్ 9 : సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీ ఘన విజయం సాధించడంతో ఆదివారం టీడీపీ నాయకులు దేవాలయంలో పూజలు, గ్రామంలో స్వీట్లు పంపిణీ చేశారు. మండలంలోని కేతేపల్లిలో టీడీపీ నాయకులు మల్లేగౌడ్, రామాంజనప్ప, సిద్దప్ప, వెంకట రమణప్ప కార్యకర్తలతో కలిసి గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో స్వామికి ఆకుపూజ కట్టించి, ప్రత్యేక పూజలు చేశారు. స్థానికంగా స్వీట్లు తయారుచేయించి వారందరూ కలసి గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రజలకు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడి మృతి


మృతిచెందిన తిరుపాల్‌రెడ్డి

పెద్దపప్పూరు, జూన్ 9: మండలంలోని ముచ్చుకోట సమీప అటవీప్రాంతంలో ఆదివారం తిరుపాల్‌రెడ్డి (60) అనే వృద్ధుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. యల్లనూరు మండలం పాతపల్లికి చెందిన తిరుపాల్‌రెడ్డి కొంతకాలంగా గుండె సమస్యతో బాధపడుతుండేవాడు. పలుమార్లు హార్ట్‌స్ట్రోక్ రావడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డాడని తెలిపారు. తాడిపత్రిలో ధర్మవరం బస్సుఎక్కిన తిరుపాల్‌రెడ్డి ముచ్చుకోట అటవీప్రాంతం వద్ద దిగి లోపలికి వెళ్లాడు. పొలం పనులకు వెళుతున్న పలువురు మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు.

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు


కొళగానహళ్లి శివారులో నేలకొరిగిన విద్యుత్ స్తంభం

బొమ్మనహాళ్, జూన్ 9: మండలంలో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. కొళగానహళ్లి గ్రామ శివారులోని విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. స్తంభాలు నేలకూలడంతో కొళగానహళ్లి, లింగదహాళ్ తదితర గ్రామాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో ఆ గ్రామాలలో చీకట్లు అలుముకున్నాయి. విద్యుత్ సరఫరా లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు అంటున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పెనుకొండ రూరల్, జూన్ 9: పట్టణ పరిధిలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు ఆధ్వర్యంలో 2008-2011 మధ్య బీకాం కంప్యూటర్స్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు సమావేశమయ్యారు. కాలేజీలో చదువుకున్న జ్ఞాపకాలను ఒకరినొకరు పంచుకున్నారు. అనంతరం కళాశాలలో చదువుకుని స్థిరపడ్డ వారిని అభినందించా రు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జయప్ప, పూర్వ అధ్యాపకులు రామన్న, నరసింహ, మహేష్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.


అధ్యాపకులతో పూర్వ విద్యార్థులు

జోరుగా సాగు



● ఈ ఏడాది జిల్లాకు ముందుగానే నైరుతి రుతుపవనాలు ● రైతుల్లో హర్షం ● వేరుశనగ విత్తన సాగులో బిజీ.. బిజీ..


ఎద్దులతో వేరుశనగ విత్తనం వేస్తున్న రైతు


ట్రాక్టరుతో వేరుశనగ వేస్తున్న రైతు


వేరుశనగ విత్తన శుద్ధి చేస్తున్న మహిళ

గుత్తి రూరల్, జూన్ 9: జిల్లాకు ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు నాలుగు రోజులు ముందే రావడంతో సాగుపనులు జోరందుకున్నాయి. రైతులు వేరుశనగ, పత్తి విత్తన సాగుల్లో బీజీబీజీగా ఉన్నారు. ఏడాదిగా వరుణుడి రాక కోసం ఎదురు చూస్తున్న అన్నదాత ఆశలు ఖరీఫ్‌లో ఫలించాయి. గత ఏడాది కరువుతో విలవిలలాడిన అన్నదాత ఆవేదన ఈ సారి తీరేలా ఉందని ఆశతో విత్తనాలు జోరుగా వేస్తున్నారు. మండల వ్యాప్తంగా వారం రోజులుగా వర్షాలు కురుస్తుండంతో రైతులు వేరుశనగ, పత్తి, కంది, ఆముదం విత్తనాలు వేస్తున్నారు. మండలంలోని గొందిపల్లి, గాజులపల్లి, జక్కలచెరువు, కొత్తపేట, ఊబిచెర్ల, బేతాపల్లి యంగన్నపల్లి, కొత్తపల్లి, తొండపాడు, తదితర గ్రామాల్లో పొలాల విత్తే పనుల్లో నిమగ్నమయ్యారు. చేతిలో డబ్బు లేకపోయినా అప్పులు చేసి మరీ రైతు సాగుపనులకు సిద్ధమవుతున్నారు. మృగశిర కార్తెలో వర్షాలు కురవడం ఆనందకరమని రైతులు అభిప్రాయపడుతున్నారు. ఈ కార్తెలో పంట సాగు చేస్తే పంటలు చేతికంది రైతుల ఇంట సిరులు కురుస్తాయని రైతుల నమ్మకం. మండల వ్యాప్తంగా 18 వేల హెక్టార్లలో సాగుకు సిద్ధంగా ఉన్నారు. మండల వ్యాప్తంగా 4 వేల హెక్టార్లలో వేరుశనగ, పంటను సాగు చేస్తున్నారు. మండల వ్యాప్తంగా పత్తి వేయి ఎకరాల్లో సాగు చేస్తున్నారు. సాగు పనులు మొదలవ్వడంతో ట్రాక్టర్లకు డిమాండ్ పెరిగింది. ఎకరాకు ట్రాక్టర్‌కు రూ.1100 నుం రూ.1200లు ఖర్చు చేసి వేరుశనగ విత్తనం వేస్తున్నారు. ఎద్దులతో ఎకరాకు రూ.1000 బాడుగ చెల్లిస్తున్నారు. ఈ ఏడాది వరుణదేవుడిపై భారం ఉంచి పెట్టుబడులు పెడుతున్నామని ఈసారైన కరుణిస్తే అప్పుల నుంచి బయట పడతామని రైతులు ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది మే, జూన్ మాసాల్లో వర్షాలు బాగా కురవడంతో సేద్యాలు చేసి విత్తనానికి సిద్ధం చేసుకున్నామని రైతులు తెలిపారు.


పత్తి విత్తనాలు నాటుతున్న కూలీలు

మృగశిర కార్తెలో వేరుశనగ సాగు : కిష్టయ్య, రైతు, గొందిపల్లి



మూడు ఎకరాల్లో వేరుశనగ సాగు చేశా. మృగశిర కార్తెలోనే విత్తనం వేస్తున్నా. ఈ కార్తెలో వేస్తే పైరు బలంగా వచ్చి మేలైన దిగుబడులు వస్తాయన్న నమ్మకంతో మొదలు పెట్టాను. ప్రస్తుతానికి ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. ఈ ఏడాదైనా పంట పండకపోతుందా అని ఆశతో ఉన్నాం.

దేవుని మీద భారం వేసి సాగు చేస్తున్నా: సుధాకర, కొత్తపేట



దేవుడి మీద భారం వేసి మంచి అదునులో వేరుశనగ సాగు చేస్తున్నాను. మృగశిర కార్తెలో వర్షం బాగా రావడంతో మంటపై ఆశ నెలకొంది. ఏటా జూన్ మాసంలో సాగు చేస్తున్నాను. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురిసి వేరుశనగ మంచి దిగుబడి వస్తుందని పంట సాగు చేస్తున్నాను. లాభాలు మిగలాలని కోరుకుంటున్నా.


కడదరకుంట వద్ద వర్షానికి కుళ్లిపోయిన వేరుశనగ కట్టె

ఎడతెరిపి లేని వాన... కుళ్లుతున్న పంటలు

కూడేరు, జూన్ 9: ఎడతెరిపి లేని వర్షాలతో వేరుశనగ పంట కుళ్లిపోతోంది. మండలంలోని కడదరకుంట గ్రామానికి చెందిన రైతు వడ్డే అనిల్ తన ఏడెకరాల పొలంలో నాలుగు ఎకరాల్లో రబీలో వేరుశనగ సాగు చేశాడు. లక్షన్నర వరకు పెట్టుబడి పెట్టి పంట సాగు చేస్తే చేతికొచ్చిన పంట వర్షానికి పూర్తిగా దెబ్బతింది. కుళ్లిపోయిన వేరుశనగపంటను చూసి రైతు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నాడు. మరోరైతు నారాయణస్వామి సాగుచేసిన పంట కోత దశకు రావడంతో పంటను తొలగించాడు. పంట తొలగించినప్పటి నుంచి వర్షం కురుస్తుండటంతో పొలంలోనే వేరుశనగ కట్టె కుళ్లిపోయింది. రూ.లక్షలు అప్పులు చేసి పంటలు సాగుచేస్తే వర్షాలతో తడిసిపోయామని, ప్రభుత్వమే ఆదుకోవాలని అన్నదాతలు వేడుకుంటున్నారు.


కుళ్లిన కట్టెను చూపుతున్న రైతు అనిల్

పత్తి కూడా..

బొమ్మనహాళ్ : మండలంలో రోజూ కురుస్తున్న వర్షాలతో పత్తి, మొక్కజొన్న, సజ్జ తదితర పంటలు దెబ్బతిని రైతులకు నష్టాన్ని మిగులుస్తున్నాయి. ఉద్దేహాళ్, రంగాపురం క్యాంప్, కొళగానహళ్లి, గౌనూరు, కల్లుదేవనహళ్లి తదితర గ్రామాల్లో పంటలు సాగుచేశారు. కొద్దిరోజులుగా వర్షం పడుతున్న నేపథ్యంలో వాగులు, వంకలు పొంగి పొర్లుతూ పొలాలలో నీరు నిలిచి పత్తి మొక్కలు కుళ్లిపోతున్నాయి. పంటలు చేతికొచ్చే వేళ కుళ్లిపోతుండంతో అన్నదాతకు ఆవేదనే మిగిలింది.


కుళ్లిపోతున్న మొక్కలను చూపుతున్న రైతు

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో అనంత విద్యార్థుల ప్రతిభ


సతీష్‌రెడ్డిని అభినందిస్తున్న కుటుంబ సభ్యులు


అభినందిస్తున్న నారాయణ కోర్ డీన్ బద్రీనాథ్

అనంతపురం విద్య, జూన్ 9: ఇండియాలోని ప్రముఖ ఐఐటీలు, ఎన్ఐటీ సంస్థల్లో ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే జేఈఈ అడ్వాన్స్ పరీక్షల్లో అనంతపురం జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు ప్రతిభ చాటారు. ఆదివారం విడుదలైన జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో మెరుగైన ర్యాంకులు సాధించారు. విద్యార్థుల కుటుంబాల్లో, కళాశాలల్లో సంబరాలు జరుపుకున్నారు.

రైతు బిడ్డకు మెరుగైన ర్యాంకు

సామాన్య రైతు కుమారుడు సత్తా చాటాడు. విద్యార్థి పాలగిరి సతీష్‌రెడ్డి ఆలిండియా స్థాయిలో ఓపెన్ కేటగిరీలో 175వ ర్యాంకు సాధించాడు. బుక్కరాయసముద్రం మండలం చెన్నంపల్లికి చెందిన లక్ష్మీరెడ్డి కుమారుడు సతీష్‌రెడ్డి జేఈఈ అడ్వాన్స్ పరీక్షల్లో 285 మార్కులు సాధించాడు. ఓపెన్ కేటగిరీలో 175వ ర్యాంకు సాధించడంతో...విద్యార్థి కుటుంబికులు హర్షం వ్యక్తం చేశారు. సతీష్‌రెడ్డికి స్వీట్లు తినిపించి ఆనందం పంచుకున్నారు.

నారాయణలో...

జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థి శశికిరణ్ 360 మార్కులకు గాను 234 మార్కులు సాధించడంతో విద్యార్థిని ప్రత్యేకంగా అభినందించారు. కళాశాల కోర్ డీన్ బద్రీనాథ్, డీన్ శ్రీనివాసరెడ్డి, డీజీఎం వెంకటరామిరెడ్డి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ఏ కాలేజీలోని విద్యార్థులకు శశికిరణ్‌కు వచ్చిన ర్యాంకు రాలేదన్నారు. శశికిరణ్ ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 982వ ర్యాంకు సాధించాడన్నారు. మేఘన 4,124వ ర్యాంకు, మోహన్ ప్రదీప్ 4,657వ ర్యాంకు, అజయ్ కృష్ణారెడ్డి 5,287 ర్యాంకు, సిద్ధార్థరెడ్డి 16,145వ ర్యాంకు, అసిమ్‌ఖాన్ 17,929 ర్యాంకు ఆలిండియా స్థాయిలో సాధించారన్నారు. దీపిక 2,241, స్తుతి ప్రశంసిని 3713, రేణుక 4,658 ప్రిపరేటరీ ర్యాంకులు సాధించి క్వాలిఫై అయినట్లు తెలిపారు. మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులకు అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు రవిశంకర్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, హిమబిందు, శిఖామణి, లక్ష్మన్న, జయలక్ష్మి,బాలన్న తదితరులు పాల్గొన్నారు.

2059వ ర్యాంక్

తాడిపత్రిటౌన్ : జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో తాడిపత్రి పట్టణంలో నివాసం ఉంటున్న శ్రీనివాసులురెడ్డి, రాజేశ్వరి దంపతుల కుమారుడు చక్రధర్‌రెడ్డి 2059 ర్యాంకు సాధించడంతో కుటుంబంలో ఆనందం నెలకొంది.


చక్రధర్‌రెడ్డి


నారాయణ విద్యార్థులు మేఘన, మోహన్ ప్రసాద్, సిద్ధార్థరెడ్డి

మాజీ ఎమ్మెల్యే సేవలో పోలీసులు

● కొడిమి జగనన్న లేఅవుట్‌లో మిషనరీ, ఇతరత్ర సామగ్రి తరలింపు
● అడ్డుకున్న నరసనాయునికుంట, కొడిమి గ్రామాల టీడీపీ శ్రేణులు
● పోలీసులు రక్షణగా ఉండటంపై ఆగ్రహం


సీఐ, పోలీసులతో టీడీపీ శ్రేణుల వాగ్వాదం

అనంతపురం రూరల్, జూన్ 9: కొత్త ప్రభుత్వం ఏర్పడుతున్న సమయంలో కూడా పోలీసులు పాత ఎమ్మెల్యే సేవలో తరిస్తున్నారని టీడీపీ నాయకులు విమర్శిస్తున్నారు. మండలంలోని కొడిమి జగనన్న లేఅవుట్‌లో ఆదివారం రాక్రీట్ కంపెనీ సభ్యులు మిషనరీ, సెంట్రింగ్ సామగ్రి తరలిస్తుండగా నరసనాయుని కుంట, కొడిమి గ్రామానికి చెందిన టీడీపీ శ్రేణులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు ఇళ్ల నిర్మాణలు పూర్తి కాలేదు. ఇంకా 44ఎకరాలకు సంబంధించి రైతులకు పరిహారం ఇవాల్సి ఉంది. ఇవేవి కూడా పూర్తిస్థాయిలో తేలకుండా సామగ్రి ఎలా తీసుకెళతారని కంపెనీ ప్రతినిధులను, ఈ దురాగతానికి అండగా ఎలా ఉంటారని పోలీసులను ప్రశ్నించారు. ఐదేళ్లుగా రైతులను బెదిరించి నిర్మాణాలు చేశారు. ఇళ్ల నిర్మాణం పూర్తి కాకుండానే బిల్లుల సొమ్మును తీసేసుకున్నారని పేర్కొన్నారు. అధికారం మారగానే కంపెనీ సభ్యులు జారుకోవాలని చూడటం ఎంత వరకు సమంజసమని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు వారికి వత్తాసుగా ఉదయం నుంచి ఉండటం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. సామగ్రి తరలింపుపై పోలీసులను ప్రశ్నిస్తే..హౌసింగ్ డీఈఈ పేరు చెబుతున్నారన్నారు. ఆయనకు తాము ఫోన్ చేస్తే పనిచేయడం లేదన్నారు. తరలిస్తున్న సామగ్రి కంపెనీకి సంబంధించినదే అని ఎలా తెలుస్తుందని ప్రశ్నించారు పోలీసులు మాజీ ఎమ్మెల్యేకు సాయం చేసేందుకు ఇలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఉదయం నుంచి ఎమ్మెల్యే సోదరుడి బావమరిదిని దగ్గరుంచుకుని సామగ్రిని తరలించడంపై తమకు అనుమానాలున్నాయన్నారు. ఈరోజు మిషనరీ తీసుకెళ్తున్నారు. మరో రోజు ప్రభుత్వ నిధులతో కొనుగోలు చేసిన కడ్డీలు, ఇసుక, సిమెంటు ఇతరత్రవాటిని తీసుకెళ్లిపోతారని అనుమానం వ్యక్తం చేశారు. ఇప్పటికే ఇక్కడ సిమెంట్ పెల్లలను బయటకు తరలించి అమ్ముకుని సొమ్ము చేసుకున్నారని ఆరోపించారు.


యంత్రాలను తరలిస్తున్న దృశ్యం

రైతు బతుకే దేశ ప్రగతి

● జనప్రియ కవి ఏలూరు యంగన్న

అనంతపురం కల్చరల్, జూన్ 9 : రైతు బతుకే దేశ ప్రగతి అని, రైతు లేకపోతే ఏ దేశమైనా ప్రగతిని సాధించలేదని జనప్రియ కవి ఏలూరు యంగన్న పేర్కొన్నారు. కవి మార్తాటి ఈశ్వరీ గోపాలరావు రచించిన 'రైతు మా రాజు" పుస్తకాన్ని ఆదివారం స్థానిక ఎన్జీఓ హోంలో ఎస్కేయూ తెలుగు శాఖ విభాగాధిపతి ఆచార్య బాలసుబ్రహ్మణ్యం అధ్యక్షతన ఏలూరు యంగన్న చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు మా రాజు కావ్యంలో రచయిత పశు సంపదనే దేశ సంపదగా కీర్తిస్తాడన్నారు. ఎరువుల కల్తీని ఎండగడతాడని పేర్కొన్నారు. ఈశ్వరీ గోపాలరావు కేవలం కవి మాత్రమే కాదని, మంచి సామాజిక నాటకాలను రచించి ప్రజల్లో చైతన్యం కలిగించాడని కొనియాడారు. సీనియర్ సాహితీవేత్త తూముచర్ల రాజారామ్ మాట్లాడుతూ... రైతు మా రాజు' పుస్తకంలో కష్టపడే రైతు జీవితం, మట్టి వాసన, పల్లెటూరి సోయగాలు, రైతును ముడిపెట్టిన జీవితం కనిపిస్తుందన్నారు. ఏ దేశం అయితే రైతును గౌరవిస్తుందో ఆ దేశం అభివృద్ధి చెందుతుందని కవి స్పష్టంగా వ్యక్తపరిచాడన్నారు. అనంతరం ఈశ్వరీ గోపాలరావు దంపతులను ఘనంగా సత్కరించారు. తదనంతరం బహుముఖ ప్రజ్ఞాశాలి రామోజీరావు మరణం పట్ల సాహితీకారులు సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్పందన అనంత కవుల వేదిక ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర శాస్త్రి, టీవీ రెడ్డి, నానీల నాగేంద్ర, పూజారి ఈరన్న, గంగిరెడ్డి అశ్వర్థరెడ్డి, గోవిందరాజులు, దాసన్నగారి కృష్ణమూర్తి పాల్గొన్నారు.


ఈశ్వరీ గోపాలరావు దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

గ్రామాల్లో ఘర్షణల జోలికి వెళ్లొద్దు

పార్టీ శ్రేణులకు పరిటాల సునీత, శ్రీరామ్ పిలుపు

అనంతపురం అర్బన్, జూన్ 9: గ్రామాల్లో ఘర్షణల జోలికి వెళ్లకూడదని మాజీ మంత్రి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ పార్టీ శ్రేణులకు సూచించారు. నగరంలోని వారి స్వగృహంలో ఆదివారం రాప్తాడు నియోజకవర్గంలోని పలు గ్రామా టీడీపీ నాయకులు, కార్యకర్తలు పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్‌లకు పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ ఎన్నికల విజయోత్సాహంలో పార్టీ శ్రేణులంతా ఉండటం సంతోషంగా ఉందన్నారు. ఎవరూ గ్రామాల్లో ఘర్షణల జోలికి వెళ్లకూడదని సూచించారు. ఘోర పరాభవం చెందిన వైసీపీ శ్రేణులు కవ్వింపు చర్యలకు దిగవచ్చునని, అయినా సంయమనంతో ఉండాలన్నారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండాలన్నదే టీడీపీ సిద్ధాంతం, తమ లక్ష్యం కూడా అన్నారు. గ్రామాల్లో ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.


పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్‌ను కలిసిన టీడీపీ నాయకులు

ఇంక చాలు.. ఈ జీవితం..!

జిల్లాలో ఐదుగురి ఆత్మహత్య

పుట్లూరు, జూన్ 9: మండలంలోని సంజీవపురం గ్రామానికి చెందిన ఉమ్మడి ముఖేష్‌కుమార్‌రెడ్డి (27) అప్పులబాధతో ఆదివారం ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ముఖేష్‌కుమార్‌రెడ్డి మూడేళ్ల నుంచి అరటికాయల వ్యాపారం చేస్తూ నష్టపోయాడు. అప్పుగా అరటికాయలు ఎత్తించిన రైతులు ఒత్తిడి చేయడంతో భరించలేక ఇంటిలోని బాత్రూం శుభ్రపరిచే యాసిడ్‌ను తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈయనకు భార్యతోపాటు నాలుగేళ్ల కుమారుడు ఉన్నారు. తండ్రి లక్ష్మీనారాయణరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కళ్యాణదుర్గంరూరల్: మండలంలోని మంగళకుంట గ్రామానికి చెందిన కురుబ నాగరాజు (38) ఆదివారం మద్యం మత్తులో తన వ్యవసాయ పొలంలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కురుబ నాగరాజుకు ఆత్మకూరు మండలం యాలేరు గ్రామానికి చెందిన జ్యోతితో వివాహం జరిగింది. ఈయన ఇల్లరికం వెళ్లి యాలేరులో స్థిరపడ్డాడు. ఎన్నికల నేపథ్యంలో ఓటు వేయడానికి మంగళకుంటకు వచ్చి, అప్పటి నుంచి ఇక్కడే ఉన్నట్లు గ్రామస్థులు తెలిపారు. మృతుడికి కుమారుడు, భార్య ఉన్నారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మండలంలోని ఎగువతండాకు చెందిన చందానాయక్ (35) మద్యం మత్తులో తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతిచెందాడు. చందానాయక్ మద్యానికి బానిసై తరచుగా భార్యతో గొడవపడేవాడు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం భార్య భానుబాయితో గొడవపడ్డాడు. దీంతో ఆమె తన కుమారుడితో పుట్టింటికి వెళ్లిపోయింది. ఇంట్లో ఒక్కడే ఉన్న చందానాయక్ మద్యం మత్తులో ఉరి వేసుకున్నాడు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో రైతు...

బ్రహ్మసముద్రం: మండలంలోని చెలిమేపల్లి గ్రామంలో గొల్ల గిడ్డప్ప (58) ఆదివారం కుటుంబ కలహాలతో వ్యవసాయ పొలంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. కుటుంబ సభ్యులు గమనించి ఆటోలో రాయదుర్గం ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. బ్రహ్మసముద్రం ఎస్ఐ పరశురాముడు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. మృతికి గల కారణాలపై కుటుంబ సభ్యులను ఆరా తీశారు.

యాడికి: మండలంలోని గుడిపాడు గ్రామానికి చెందిన మద్దిలేటి (78) అనారోగ్యంతో ఆదివారం బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మద్దిలేటి కొన్ని సంవత్సరాల నుంచి ఆయాసంతో బాధపడుతుండేవాడు. వయోభారానికి వ్యాధి తోడవడంతో భరించలేక ఆదివారం మధ్యాహ్నం గ్రామసమీపంలోని బావిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు మద్దిలేటి మృతదేహాన్ని బావి నుంచి బయటకు తీయించారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మెడికో దుర్మరణం



తేజేశ్వర్ రెడ్డి (ఫైల్)

మడకశిర, జూన్ 9: కర్నూలు నగరంలోని మెడికల్ కళాశాల సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో తేజేశ్వర్ రెడ్డి (21) అనే మెడికల్ కళాశాల విద్యార్థి దుర్మరణం చెందాడు. అనంతపురం జిల్లా రొళ్ల మండలం పిల్లిగుండ్ల గ్రామానికి చెందిన తేజేశ్వర్ రెడ్డి ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. స్థానిక రాజ్‌విహార్‌లో ఉన్న మెడికల్ కళాశాల హాస్టల్‌లో ఉంటున్నాడు. ఆదివారం ఉదయం మెడికల్ కాలేజీలోని రీడింగ్ రూమ్‌కు చదువుకునేందుకు వచ్చాడు. కొద్దిసేపు తర్వాత తిరిగి హాస్టల్‌కు మోటారు సైకిల్‌పై వెళ్తుండగా.. వెనుక నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కింద పడ్డ తేజేశ్వరరెడ్డిపై బస్సు టైరు ఎక్కడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరకుని తేజేశ్వర్ రెడ్డి మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. తేజేశ్వర్ రెడ్డి తల్లిదండ్రులు వెంకటనాథప్ప, గీతాలక్ష్మిలు ప్రభుత్వ టీచర్లుగా పని చేస్తున్నారు. తేజేశ్వరరెడ్డి సోదరుడు కూడా ఇటీవలే నీట్ పరీక్ష రాసినట్లు తెలిసింది. తేజేశ్వర్ రెడ్డి మొదటి ప్రయత్నంలోనే ఆలిండియా కౌన్సెలింగ్‌లో ర్యాంకు దక్కించుకున్నాడు. చేతికొచ్చిన కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో తల్లిదండ్రుల రోధన వర్ణనాతీతం. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఓటర్ల యూటర్న్

జిల్లాలో టీడీపీకి 1.90 లక్షల ఓట్ల ఆధిక్యం

- గత ఎన్నికల్లో వైసీపీకి 1.88 లక్షల ఓట్లు
- ఈ ఎన్నికల్లో అంతకు మించి.. కూటమికి..
- వైసీపీ పాలనపై తీవ్ర వ్యతిరేకతే కారణం



2019 సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలోని ఉరవకొండ మినహా మిగిలిన ఏడు నియోజకవర్గాల్లో వైసీపీ విజయం సాధించింది. టీడీపీ కంటే 1.88 లక్షలకుపైగా ఓట్ల ఆధిక్యతను కనబరించింది. ఈ సార్వత్రిక ఎన్నికల్లో అదే ఓటర్లు యూటర్న్ తీసుకున్నారు. జిల్లాలోని 8 నియోజకవర్గాల్లోనూ టీడీపీ అభ్యర్థులకే పట్టం కట్టారు. 1.90 లక్షలకుపైగా ఓట్ల అధిక్యతను టీడీపీకి ఇచ్చారు. దీన్నిబట్టి చూస్తే ఐదేళ్ల వైసీపీ పాలనపై ప్రజలు ఎంతగా విసిగిపోయారో అర్థం అవుతుంది. బటన్ నొక్కుడుతో అరకొరగా సంక్షేమ పథకాలు అమలు చేయడం మినహా జిల్లాలో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదన్నది నిర్వివాదాంశం. ఇచ్చిన హామీలను కూడా వైసీపీ అమలు చేయలేదనడంలో ఎలాంటి సందేహం లేదు. పెండింగ్ ప్రాజెక్టుల గురించి అస్సలు పట్టించుకోలేదు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పన ఊసే మరిచిపోయారు. ఏ ఒక్క పరిశ్రమను జిల్లాకు తీసుకురాలేదు. ఇలా అనేక హామీలు మాటలకే పరిమితమయ్యాయి.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం

2019, 2024 ఎన్నికల్లో ఏ పార్టీకి ఎన్ని ఓట్లంటే...

	2019లో			2024		
నియోకవర్గం	వైసీపీ	టీడీపీ	మెజార్టీ	టీడీపీ	వైసీపీ	మెజార్టీ
రాయదుర్గం	1,09,043	94,994	14049	1,30,309	88,650	41,659
ఉరవకొండ	88,077	90,209	2132	1,02,046	80,342	21,704
గుంతకల్లు	1,06,922	58,390	48532	1,01,700	94,874	6,826
తాడిపత్రి	92,911	85,400	7511	1,13,755	86,024	27,731
శింగనమల	1,18,044	71,802	46242	1,02.957	94,169	8,788
అనంతపురం అర్బన్	88,704	60,006	28698	1,03,334	80,311	23,023
కళ్యాణదుర్గం	88,051	68,155	19896	1,18,878	81,144	37,734
రాప్తాడు	1,11,201	85,626	25575	1,16,140	92,811	23,329
మొత్తం	8,02,953	6,14,582	1,88,371	8,89,119	6,98,325	1,90,794



టీడీపీకి 1.90 లక్షలకుపైగా ఓట్ల ఆధిక్యత

జిల్లాలోని రాప్తాడు, అనంతపురం అర్బన్, కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఉరవకొండ, తాడిపత్రి, శింగనమల, గుంతకల్లు నియోజకవర్గాల్లో మొత్తం 20,18,162 మంది ఓటర్లు ఉన్నారు. అందులో ఈ ఎన్నికల్లో 16,36,448 ఓట్లు పోలయ్యాయి. ఇందులో టీడీపీకి 8,89,119 ఓట్లు వచ్చాయి. అంటే 54.33 శాతం ఓట్లు టీడీపీకి పోలయ్యాయి. 8 నియోజకవర్గాల్లోనూ కూటమి టీడీపీ అభ్యర్థులే విజయం సాధించారు. 1,90,794 ఓట్లు మెజార్టీని సాధించింది. ఇక వైసీపీ విషయానికొస్తే ఈ ఎన్నికల్లో 8 నియోజకవర్గాలకుగానూ వైసీపీకి 6,98,325 ఓట్లు చ్చాయి. అంటే 42.67 శాతం ఓట్లు వచ్చాయి.



2019లో వైసీపీకి 1.88 లక్షల ఓట్ల ఆధిక్యత...

గత సార్వత్రిక ఎన్నికల్లో 8 నియోజకవర్గాలకుగానూ 7 నియోజకవర్గాలు వైసీపీ వశమయ్యాయి. ఉరవకొండ టీడీపీకి దక్కింది. జిల్లాలో మొత్తం ఓటర్లు 19,08,668 ఉండగా... అందులో 15,21,449 ఓట్లు పోలయ్యాయి. ఇందులో వైసీపీకి 8,02,953 ఓట్లు వచ్చాయి. అంటే 52.77 శాతం ఓట్లు వచ్చాయి. 1,88,371 ఓట్లు మెజార్టీని సాధించింది. ఇక టీడీపీ విషయానికొస్తే... 8 నియోజకవర్గాల్లో 6,14,582 ఓట్లు వచ్చాయి. అంటే టీడీపీకి 40.39 శాతం ఓట్లు వచ్చాయి.

తేడా ఇదీ...

2019 ఎన్నికల్లో జిల్లాలో వైసీపీకి 52.77 శాతం ఓట్లు రాగా... టీడీపీకి 40.39 శాతం ఓట్లు వచ్చాయి. టీడీపీ కంటే వైసీపీకి 12 శాతం ఓట్లు అధికంగా వచ్చాయి. 2024 ఎన్నికల్లో పరిస్థితి తిరగబడింది. టీడీపీకి 54.33 శాతం ఓట్లు రాగా... వైసీపీకి 42.67 శాతం ఓట్లు వచ్చాయి. 12 శాతం ఓట్లు టీడీపీకి అధికంగా రావడం గమనార్హం.